





# ఎన్నాళ్ళకెన్నాళ్ళకి!



పోరంకి దక్షిణామూర్తి

అప్పుడే ఎండెక్కింది. కుళాయి బందయిపోయింది. పనిమనిషింకా రాలేదు. పాలవాడు పత్తా లేడు. ఆయన గారు మంచమే దిగలేదు. పిల్లలెటు పోయారో, ఏమో! వేణ్ణీళ్లు మరిగిపోతున్నాయి. ఒక్కళ్ళు స్నానానికి రారు; ఒక్కళ్లు చెప్పినమాట వినిపించుకోరు! "ఏం సంసారమో, ఏం బ్రతుకో!" అని విసుక్కుంది భార్గవి.

భార్గవి భూదేవి కాదు మరి, ఓరిమి పట్టడానికి; ఉద్యోగం చేసుకునే ఇల్లాలు. ఉద్యోగంలో రాసిరాసి అలిసిపోతుంది. ఇంట్లో చేసిచేసి అలిసిపోతుంది. బస్సుల కోసం కాసికాసి అలిసిపోతుంది. ఇంక సుఖమేముంటుంది? సంతోషమెక్కడిది? పిల్లలిద్దరూ రాలుగాయలు. మొగుడో కొరకరానికొయ్య. ఇక్కడి చెంబు అక్కడ పెట్టేవాళ్లు లేరు. అంచేత మొగుడి మీద విసుక్కుంటుంది. పిల్లల్నెప్పుడూ కసురుకుంటుంది. "ఇంతకంటే వెట్టిచాకిరీ నయం!" అని సణుక్కుంటుంది. విశ్వాసం లేదు మనిషికి! అయ్యో, నాకోసం కష్టపడుతోందే అన్న ఆలోచన లేదు. జీతం రోజున మాత్రం ఎక్కడిలేని ప్రేమా ఒలకబోస్తారు. ఆయనక్కావలసింది నేనూ నా సుఖమూ కాదు. పొద్దున్నే ఓ

కప్పు కాఫీ, పన్నెండు పేజీల పేపరు, వేళకి టిఫిన్లూ టీలూ. నాకొచ్చే జీతమూ, పేకాటా గుర్రప్పందేలూ. నేను కాబట్టి కాపురం చేస్తున్నాకాని మరొకత్తె అయితే ఏనాడో విడాకులిచ్చేసి ఉందును—అంటూ తన ఔదార్యాన్ని తనకు గుర్తుచేసుకుంది భార్గవి. ఇలా పొద్దున రెండుసార్లు, సాయంత్రం రెండుసార్లు, గుర్తుచేసుకుంటుంది. సెలవు రోజున మరో రెండుసార్లు అదనం.

పిల్లల్ని బడికి తరిమి, ఆయనగార్ని ఆఫీసుకు తోలి, తను ఇంట్లోంచి బయట పడేసరికి బస్సు బయల్దేరుతూనే ఉంటుంది. ఉరుకులూ పరుగులూ లేకుండా ఒక్కరోజూ జరగదు కదా!

భార్గవికి బస్సులో ఒంటికాలిమీద నిలబడ్డానికి చోటు దొరికింది. తనకన్న చిన్నవాళ్ళూ కాలేజీపిల్లలూ కులాసాగా కూర్చుని సినిమాకబుర్లు చెప్పుకుంటున్నారు. ఏ చీకూచింతాలేదు కదా. వాళ్ళ కళ్ళలో ఎంత ఉత్సాహం! వాళ్ళ మొహాల్లో ఎన్ని చిరునవ్వులు! తన చిన్నప్పటి రోజులు గుర్తొచ్చాయి. జీవితం ఎంత హాయిగా ఉండేది తనకి! ఎంత అందంగా కనిపించేది! అందరితో ఎంత కలుపుగోలుగా ఉండేది. ఎంత చలాకీగా తిరిగేది! "నువ్వు చిరునవ్వుల సిరిమంతురాలివే" అనేవాడు మావయ్య. ఆ రోజులన్నీ ఏమయిపోయాయి? ఈ సంసారంలో పడ్డాక అందరిలా హాయిగా తను నవ్వుతూ బతకలేకపోతోందేం?

పక్కనున్నావిడ కాలు తొక్కేసింది. నరాలు జివ్వుమన్నాయి. ముఖం చిట్లించుకుని కొరకొరా చూసింది భార్గవి. సినిమా కబుర్లు చెప్పుకుంటున్న పడుచుపిల్లలు ఇంకా నవ్వుకుంటూనే ఉన్నారు. 'ఇంకెంతకాలం ఈ నవ్వులు? సంసారంలో పడ్డదాకానే!' అంటూ మొహం తిప్పేసుకుంది. కొంత అసూయ కొంత జాలి. మరింత ఉడుకుమోత్తనం.

భార్గవి బస్సు దిగి రెండు ఫర్లాంగులు నడిస్తేకాని ఆఫీసు రాదు. ఎదురుగా ఒక రిక్షా వస్తోంది. రోజూ ఆ రిక్షా అదే వేళకు ఎదురుగా వస్తూంటుంది అందులో కూర్చున్నావిడ తలవంచుకుని తనలో తను నవ్వుకుంటూ ఉంటుంది. ఉద్యోగస్తురాలిమల్లేనే ఉంది. అయినా ఎందుకో ఆ కులుకు; అదో అలంకార మనుకుంటుంది కాబోలు! నా ఉద్యోగంలాంటి ఉద్యోగమూ నా సంసారంలాంటి సంసారమూ అయితే – ఆ కులుకేమవుతుందో అప్పుడు చూడాలి! ఆవిడ్ని చూస్తుంటే కళ్ళు కుట్టేమాట నిజం. ఆవిడ్ని తలచుకుంటూనే సీరియస్‌గా ఆఫీసులో అడుగుపెడుతుంది భార్గవి.

రోడ్డుమీద కార్ల రొద. పక్కగదిలో టైపుమిషన్ల చప్పుడు. గరగరమంటూ పాతకాలపు పంకా. ఆఫీసరు గదిలోంచి మాటిమాటికీ కాలింగ్‌బెల్లు మోత. వీటి మధ్య సీరియస్‌గా పనిచేసుకుంటున్న భార్గవికి ఎండాకాలం మీద మరోసారి





కోపమొచ్చింది. బయట నిప్పులు చెరుగుతోంది. కిటికీలకీ గుమ్మాలకీ చీకిపోయిన తడకలు. కరెంటు పోయి ఉడకబెట్టేస్తుంది. ఆఫీసరడిగిన అర్జంటు ఫైలు కనిపించడం లేదు. గొంతు తడి ఆరిపోయింది. తన మంచినీళ్ళగ్లాసు రోజీ పట్టుకుపోయి ఎంతకీ తెచ్చి ఇవ్వదు. తెప్పించుకుందామంటే పిలిస్తే పలికే ప్యూను ఒక్కడు లేదు. "ఛీఛీ వెధవాఫీసు, వెధవుద్యోగం." అని విసుక్కుంది భార్గవి. 'మరొకత్తె అయితే ఈపాటికి రాజీనామా ఇచ్చేసిపోయేది' అని నమ్మకంగా అనుకుంది.

ఆఫీసరు దగ్గర్నుంచి ఆ ఫైలుకోసం మళ్ళీ కబురు. బల్లమీద లేదు; బీరువాలో లేదు. ఏమయిందో తనకి తెలీదు.

తెలీదంటే ఆఫీసరు ఒప్పుకోడు. ఎలా చచ్చేది! అనుకుంటూ తనమీదా, ఫైలు మీదా, ఆఫీసరుమీదా, ఆయనకాలింగ్‌బెల్ మీదా విడివిడిగాను ఉమ్మడిగానూ కూడా విసుక్కుంది. పళ్ళు పటపటలాడించుకుంటూ, మొహం మటమటలాడించుకుంటూ, ఉస్సురుస్సురన్నుకుంటూ కొంగుతో చెమట తుడుచుకుంటూ బల్లచుట్టూరా తిరుగుతోంది భార్గవి.

"అదేమిటండీ, ఫైళ్ళరాశిచుట్టూ ప్రదక్షిణం చేస్తున్నారేమిటి?" అంటూ పనిగట్టుకుని పద్మనాభం పలకరిస్తూంటే ఇంకా చిరచిరలాడింది. "గోబర్‌గ్యాస్ ఫైలు కనిపించడంలేదు." అంది ముక్తసరిగా.

"మరి చెప్పరేం! మీనాక్షిగారు బల్లమీదుందిగా," అని అతను అనేసరికి పదరు మీనాక్షిగారు మొహం చిట్లించుకుంది. "అది నా దగ్గిరెందుకుంటుందీ?" అని సాగదీసుకుంది, వెంకటగిరిచీర జరీఅంచు సరిచేసుకుంటూ, "నిన్న పాండురంగం దగ్గర చూశాను, అడుగుతానుండండి," హడావిడిగా వెళ్ళిపోయాడు పద్మనాభం. వెళ్ళినవాడు మళ్ళీ తిరిగిరాలేదు. రోజీగదిలో కూర్చుని టీ చప్పరిస్తూ తీరిగ్గా కబుర్లు చెబుతున్నాడు. "ఛీ! ఈ మొగాళ్ళంతా ఇంతే" అనుకుంది భార్గవి.

అప్పుడే అరగంట దాటిపోయింది. ఫైలు కనిపించలేదు. పాండురంగాన్ని అడిగింది. సుందరి దగ్గర చూసింది. సులేమాన్ బల్లమీద చూసింది. రాజామణినికూడా అడిగింది ఆ ఫైలు పేరెత్తేసరికి అందరు ముక్కు మూసుకోడం మొదలెట్టారు. అసలే తనకి పౌరుషం ఎక్కువ. ఎవడిచేతా మాటపడదు. అంచేత, "ఈ వెధవఫైలు నా ప్రాణానికొచ్చింది," అని మరోసారి విసుక్కుంది. "ఏమమ్మా, ఇంకా దొరకలేదా?" అంటూ వచ్చారు సూపరింటెండెంట్ సుబ్బారావుగారు. "చూస్తూనే ఉన్నారుగా!" అంటూ కట్టెవిరిచినట్టు సమాధానం చెప్పింది. "చూడమ్మా! ఇలాటప్పుడే ఓర్పుండాలి. ఆ ఫైలు సంగతి నేను చూసుకుంటాను! మీరు ఇంటికెళ్ళి విశ్రాంతి తీసుకోండి" అని వెళ్ళిపోయారు సుబ్బారావుగారు. ఆయన మాటల్లో హేళనఉందని భార్గవి అనుమానం. కొరకొర చూసింది. బల్లమీద పరిచిన ఫైళ్ళన్ని పక్కకితోసేసి వ్యానిటి బ్యాగ్ తీసుకుని విసవిసా బయటికి నడిచింది. గేటు దాటాక నడక మందగించింది. ఎదురుగా రిక్షా. రోజూ తను పొద్దుటివేళ చూసే రిక్షా తనదగ్గరికివచ్చేసరికి చటుక్కున తలఎత్తింది.

ఎన్నడూ మాయని చిరునవ్వుతో ఎప్పుడూ ప్రసన్నంగాఉండే ముఖం ఒకటి ఇన్నాళ్ళకి చూసింది భార్గవి. తనుకూడా అలా ఎందుకు ఉండలేకపోతోంది? అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ హాయిగా కలిసిమెలిసి ఉంటూ నలుగురితో ఆనందం ఎందుకు పంచుకోలేకపోతోంది? భార్గవి సీరియస్‌గా ఆలోచిస్తోంది. అందం, డబ్బు, హోదా, అధికారం, చదువు, ఆరోగ్యం, అందరికీ సమానంగా ఉండవు. అవి లేనివాళ్ళుకూడా తనకన్న హాయిగా ఉన్నారు. ఉన్నవాళ్ళమీద అసూయా లేనివాళ్ళమీద చులకనభావం ఎందుకు తనకు? తనకు ఎవరేం అన్యాయం చేశారు? అయినా ఈ ప్రపంచంలో తన ప్రత్యేకత ఏముంది? ఏమీ లేదని ఇప్పుడు తెలుస్తోంది. తనకు సుఖంలేదని ఎందుకనుకోవాలి? అసంతృప్తి ఎందుకు? అసూయలెందుకు? అసహనం ఎందుకు? అందరూ తనని చూసి గేలిచేస్తున్నట్టూ, తనమీదే పగబట్టినట్టూ, తనని బాధించటమే వాళ్ళకి పని అయినట్టూ ఊహించుకుని బతుకు ఎంత నరకం చేసుకుంది! తనకూ లేనిదేమీ లేదు_ జీవితాన్ని గురించిన అవగాహన తప్పు!

ఎంత పొరపాటుపడ్డాను! జీవితంలో ఎంత నష్టపోయాను! కష్టపడుతున్నమాట నిజమే, కాని ఎరివకోసం, తనవాళ్ళకోసం. ఇంటిపని ఏ ఇల్లాలికి తప్పుతుంది? అది వెట్టిచాకిరి అనుకోడం ఎంత అజ్ఞానం! ఆఫీసులో వాళ్ళు నిజంగా ఎంత మంచివాళ్ళు! తన ఒంటెత్తుతనాన్నీ చిరాకునూ ఎంత సహిస్తున్నారు! లోపం ఎక్కడాలేదు, తనలోనేఉంది. ప్రపంచం తన ఒక్కతె కోసం కాదు, అందరిలో ఒకత్తెగా బతకడంకోసం, అందరిలో హాయిగా ఉండడంకోసం! "చిరునవ్వుల సిరిమంతురాలివే నువ్వు! ఆ సిరి పోగొట్టుకోకు సుమా!" అంటూ చిన్నప్పుడు మావయ్య అన్నదానికి అర్థం ఇప్పుడు తెలిసింది.

భార్గవి మనస్సు తేలికపడింది. వాతావరణం చల్లబడింది. ప్రపంచం అందంగా కనిపించింది. తనలో తను ముసిముసినవ్వులు నవ్వుకుంది.